సాక్షి
వరంగల్
సోమవారం | 3 | ఏప్రిల్ | 2023



టార్గెట్ ర్యాంక్

ఎంసెట్ ఎంట్రెన్స్‌లో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు టెమ్రిస్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనుంది. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే కోచింగ్ ఇవ్వనున్నారు. - 8లో▸



విలువలు తెలిపిన 'బలగం'

బంధాల విలువ తెలిసేలా బలగం సినిమా ఉందని మంత్రి ఎర్రబెల్లి అన్నారు. ఆదివారం అనాథ పిల్లలతో కలిసి ఆయన సినిమాను వీక్షించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$35^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ, ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.



న్యూస్‌రీల్

కంఠమేశ్వరస్వామికి బోనాలు



చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో గౌడ కులస్తులు శ్రీ కంఠమహేశ్వర స్వామి బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి మహిళలు డప్పు వాయిద్యాలతో బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా నృత్యాలు చేస్తూ వనదేవతలను దర్శించుకున్నారు. స్వామి వారికి బెల్లం, పాయసంతో చేసిన నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకులు డాక్టర్ రాణాప్రతాప్‌రెడ్డి, పెద్దలు గుళ్లపెల్లి రమేష్, దొమ్మటి కార్తిక్, అధ్యక్షుడు గుళ్లపెల్లి విజేందర్, మధు, స్వామి, రాజు, రాజేంద్రప్రసాద్, కుమారి, మల్లేష్, ఆకుల వేణు, తదితరులు ఉన్నారు.

సేంద్రియ వ్యవసాయం అలవర్చుకోవాలి



రాయపర్తి: రసాయన ఎరువులతో వ్యవసాయం చేసి ఖర్చులపాలు కావద్దని, రైతులు సేంద్రియ వ్యవసాయం మేలని తెలంగాణ గోశాలల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్‌అగర్వాల్ కోరారు. ఆదివారం మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామంలో శ్రీ బాలాజీ గోశాల ఆధ్వర్యంలో పది మంది రైతులకు ఇరవై లేగ దూడలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేష్‌అగర్వాల్ మాట్లాడుతూ రైతులు గోవులను కాపాడుకొని వాటి ద్వారా వచ్చే గోమూత్రం, పేడతో తక్కువ ఖర్చుతో సేంద్రియ వ్యవసాయం చేసి ఆరోగ్యకరమైన పంటలను పండించాలన్నారు. గోవులను దేవుళ్లుగా పూజించి కాపాడాలని కోరారు. అనంతరం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గోశాలల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, సర్పంచ్ గూబ యాకమ్మ, గోశాలల సూపరింటెండెంట్ దుర్గం రోజా, శ్రీ బాలాజీ గోశాల అధ్యక్షుడు ఎం. రాజేష్, లావుడ్య రవీందర్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్వీస్ వైర్ పట్టివేత



వర్ధన్నపేట: మండలంలోని కుమ్మరిగూడెం వెళ్లే రహదారిలోని కల్వర్టు వద్ద భారీగా సర్వీస్ వైర్ పట్టుబడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... ఇటీవల విద్యుత్ మోటార్‌తో పాటు విద్యుత్ వైర్లు, స్టాటర్‌లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ మేరకు ఇల్లంద గ్రామంలో కుమ్మరిగూడెం రహదారి మిల్లు పక్కన కల్వర్టులో సర్వీస్ వైర్‌ను కొందరు దుండగులు చీరలో కట్టి భద్ర పరిచారు. విషయం తెలుసుకున్న జీపీ సిబ్బంది కల్వర్టు లోపల దాచిన సర్వీస్ వైర్‌ను బయటకు తీసి చూశారు. అయితే సర్వీస్ వైర్‌లోని కాపర్‌ను దొంగిలించి పైన ఉండే ప్లాస్టిక్ వైర్‌ను చీరలో వదిలి పెట్టడం గమనార్హం. రైతులు జాగ్రత్తగా ఉండాలని జీపీ సిబ్బంది కోరారు. దుండగులను కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు. కాగా విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

నేడు గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ గ్రీవెన్స్ సోమవారం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ అనిసుర్ ఉర్ రషీద్ ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ హాల్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత పూర్వకంగా ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

పేస్కేల్ వర్తింపు!

సెర్ప్ ఉద్యోగులు హ్యాపీ..!

- ఈ నెల నుంచే అమలు
- తీరిన చిరకాల సమస్య
- జిల్లాలో 72 మందికి లబ్ధి
- జీఓ 11 జారీ చేసిన ప్రభుత్వం



కొనాయమాకులలో సంబురాలు జరుపుకుంటున్న సెర్ప్ ఉద్యోగులు (ఫైల్)

గీసుకొండ: జిల్లాలోని సెర్ప్ ఉద్యోగులు కుషీగా ఉన్నారు. డీఆర్‌డీఓలో 21 ఏళ్లుగా పని చేస్తున్న గ్రామీణ పేదరికి నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు ఎట్టకేలకు ఊరట లభించింది. ప్రభుత్వం చాలా కాలం తర్వాత ఉద్యోగులకు కేడర్ కేటాయించడంతో పాటు పేస్కేల్ వర్తింపజేస్తూ 11 జీఓను విడుదల చేసింది. దీంతో సుదీర్ఘ కాలం నుంచి పని చేస్తున్న ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల నుంచే పేస్కేల్ అమలు అవుతుండటంతో ఉద్యోగులకు తీపికబురు అని చెప్పవచ్చు

ప్రక్రియ ఇదీ..

కేంద్ర ప్రభుత్వం డీఆర్‌డీఓలో సెర్ప్ విభాగాన్ని ఏర్పాటు చేసి 2002, 2008లో ఉద్యోగులను భర్తీ చేసింది. హెచ్‌ఆర్ పాలసీ కింద వీరిని రిక్రూట్ చేసి ఐదేళ్లకు ఓ సారి రెన్యూవల్ చేస్తున్నారు. వీరిలో కొందరు జిల్లా స్థాయి, మరి కొందరు వివిధ స్థాయిల్లో పనిచేస్తున్నారు. వారికి ఎలాంటి పేస్కేల్, కేడర్ ఇవ్వకుండా కాంట్రాక్టు పద్ధతిన వేతనాలు ఇస్తున్నారు. చాలా కాలంగా సెర్ప్ ఉద్యోగులు తమకు కేడర్‌తోపాటు పేస్కేల్ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడంతో పాటు పలు ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగులకు కేడర్ కేటాయిస్తామని అసెంబ్లీలో ప్రకటించింది. ఈ క్రమంలో సర్కారు కేడర్, పేస్కేల్ వర్తింపజేస్తూ జీఓను జారీ చేసింది.

జిల్లాలో 73 మందికి లబ్ధి

జిల్లాలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ (1), డీపీఎం (5), ఏడీపీలు (16), సీసీలు (43), మస్టర్ బుక్ కీపర్లు (7) మందికి పేస్కేల్ అమలు చేస్తారు. ప్రభుత్వ నిర్ణయంతో వీరందరికీ మేలు జరగనుంది. ఇప్పటి వరకు పేస్కేల్ లేకపోవడంతో పాటు ఏ కేడర్‌లో పని చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కేడర్ ఫిక్స్ కావడంతో ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో పేస్కేల్ వర్తించడంతో వేతనాలు పొందనున్నారు. ఇతర అలవెన్స్‌లతో పాటు ఈఎస్‌ఐ, ఈపీఎఫ్‌లు వర్తించనున్నాయి.

డీడీఎంల అసంతృప్తి..

ఇది ఇలా ఉండగా కేడర్ వర్తింపు విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సెర్ప్ డీడీఎంలు అసంతృప్తితో ఉన్నారు. జిల్లా స్థాయిలో ఈ కేడర్‌లో పని చేస్తున్న వారు కింది స్థాయి పోస్టులకు దిగజారనున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేడర్ కేటాయింపులు ఇలా..

కేటగిరీ	కేడర్	పేస్కేల్(రూ.ల్లో)
అడిషనల్ డీఆర్‌డీఓ	ప్రాజెక్టు మేనేజర్	51,320–1,27,310
డీపీఎంలు	సూపరింటెండెంట్	42,320–1,15,271
ఏపీఎంలు	సీనియర్ అసిస్టెంట్	32,810–96,890
సీసీలు	జూనియర్ అసిస్టెంట్	24,280–72,850
ఎంఎస్‌సీసీ	ఆఫీస్ సబార్డినేట్	19,000–56,850
ఓఎస్	ఆఫీస్ సబార్డినేట్	19,000–58.850
ఏఏ	జూనియర్ అసిస్టెంట్	24,280–72,850
డ్రైవర్	డ్రైవర్	22,900–69,150

నాణ్యమైన విద్యుత్ అందించాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న గోపాల్‌రావు

సంగెం: యాసంగిలో వేసిన పంటలు ఎండిపోకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు ఆదేశించారు. ఆదివారం సంగెం మండలంలోని కాపులకనిపర్తి సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఫీడర్‌లోడ్ పొజిషన్ ఎలా ఉందని పరిశీలించారు. లైన్లో విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు, అంతరాయం కలిగితే చేపడుతున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఈదురుగాలులకు కలిగిన అంతరాయం గురించి అడుగగా మండలంలో సుమారు 60 విద్యుత్ స్తంభాలు విరిగితే గృహాలకు ఒక రోజు, వ్యవసాయానికి రెండు రోజుల్లో స్తంభాలు నాటి విద్యుత్‌ను పునరుద్ధరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ నరసింహారావు, ఏఈలు తిరుపతిరెడ్డి, క్రాంతికుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఉపయోగపడేలా కేంద్ర పథకాలు



మాట్లాడుతున్న నివేదిత సుబ్రమణియన్

వర్ధన్నపేట: కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉపయోగపడేలా పథకాలు రూపొందించిందని బీజేపీ కేరళ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నివేదిత సుబ్రమణియన్ అన్నారు. ఆదివారం మండలంలోని ఇల్లంద, వర్ధన్నపేటలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బండారి కల్యాణి అధ్యక్షతన నియోజకవర్గ ప్రవాస్ యోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా నివేదిత, జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నివేదిత మాట్లాడుతూ మహిళా సంక్షేమం కోసం కేంద్రం పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందన్నారు. మహిళలకు ప్రత్యేక ప్రాముఖ్యతను ఇస్తూ బేటి బచావో- బేటీ పడావో, సుకన్య సమృద్ధి యోజన, మాతృ వందన లాంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ పెడుతూ పౌష్టిక ఆహారం అందిస్తుందన్నారు. పీఎం జీవన్‌జ్యోతి, పీఎం జీవన్ సురక్ష లాంటి పథకాలు పేదలకు ఉపయోగపడే విధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాక్ సమాఖ్య వారు గ్రామంలోని పలువురికి 10 కేజీల చొప్పున బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాయపురపు కుమారస్వామి, జిల్లా ఉపాధ్యక్షురాలు కాసు శిల్ప, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సరిత, మండల మోర్చా అధ్యక్షురాలు ఇల్లందుల రాణి, త్రిలోక్, మంచె యాదమ్మ పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

వరంగల్ రూరల్: ప్రభుత్వ జీఓ 58, 59 కింద నిరభ్యంతర ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు ఈ నెల 30వ తేదీ వరకు ప్రభుత్వం దరఖాస్తుల గడువు పొడిగించిందని కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'గృహలక్ష్మి'లో మొదటి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఖానాపురం: గృహలక్ష్మి పథకంలో అర్హుల జాబితాను ఎంపిక చేసి గ్రామ పంచాయతీ ఎదుట జాబితా ప్రదర్శన చేస్తారని, జాబితాలో ప్రభుత్వం గుర్తించిన తర్వాత కడుపు ఖాళీగా ఉన్న మనోళ్లకే (గులాబీ కార్యకర్తలకు) ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని బుధరావుపేట పరిధిలోని సొసైటీ గోదాం వద్ద ఎనిమిది గ్రామాల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్ది మాట్లాడుతూ గిరిజనులకు పట్టాలు తయారు అయ్యాయని, గిరిజనేతరులకు పొజిషన్ సర్టిఫికెట్‌లు తయారు అయ్యాయని, త్వరలోనే పట్టాల పంపిణీ చేపడతామన్నారు. ప్రజల మధ్య బతికినోడే నాయకుడని, ఓట్ల కోసం వచ్చిన వారు నాయకుడు ఎలా అవుతాడన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తల సంక్షేమానికి, పథకాల కోసం సమ్మేళనాల తర్వాత కృషి చేస్తామన్నారు. నర్సంపేట నియోజకవర్గానికి గృహలక్ష్మిలో 5వేల ఇళ్లు రానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కాస ప్రవీణ్‌కుమార్, కుందనపల్లి శైలజ, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు పాపన్న

- కలెక్టర్ ప్రావీణ్య



పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య , అధికారులు



నర్సంపేటలో..

వరంగల్ రూరల్: స్వాతంత్య్ర సమరయోధుడు సర్దార్ పాపన్న గౌడ్ ఉమ్మడి వరంగల్ జిల్లా వాసి కావడం గర్వకారణమని కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. ఆదివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పాపన్న గౌడ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రావీణ్య పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ బడుగు బలహీన వర్గాల పక్షాన నిలిచి అన్యాయాలను అక్రమాలను ఎదుర్కొంటూ గొప్ప పోరాటయోధుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్‌లో జన్మించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ కులవృత్తిని నమ్ముకుని జీవించారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అశ్విని తానాజీ వాకడే, జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి శంకర్ నాయక్, గౌడ సంఘాల నాయకులు రమేష్ గౌడ్, సుధాకర్, బొమ్మెర కుమారస్వామి, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీకాంత్, జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి, ముఖ్య ప్రణాళికాధికారి గుర్రాల జీవరత్నం, అధికారులు పాల్గొన్నారు.

బహుజన వీరుడు సర్వాయి పాపన్న

నర్సంపేట: తొలి దళిత బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర కార్యదర్శి, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ కమిటీ ప్రధాన కార్యదర్శి అనంతుల రమేష్‌గౌడ్ అన్నారు. పాపన్నగౌడ్ 314వ వర్ధంతిని పట్టణంలోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సెంటర్‌లో ఆదివారం విగ్రహ కమిటీ, గౌడ జన హక్కుల పోరాట సమితి మోక్కుదెబ్బ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ కమిటీ అధ్యక్షుడు సోల్తి సారయ్యగౌడ్ పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రమేష్‌గౌడ్ మాట్లాడుతూ పాపన్నగౌడ్ సేవలను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో విగ్రహ కమిటీ కోశాధికారి ఊడ్గుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు గిరిగాని సాంబయ్య, నాయకులు నాగెల్లి వెంకటనారాయణ, కారుపోతుల విజయ్, చుక్క కనుకయ్య, తాళ్లపెల్లి చంద్రమౌళి, జూలూరి సత్యేందర్, గంప రాజేశ్వర్, మాచర్ల ఐలుమల్లు, గోడిశాల సదానందం, మద్దెల సాంబయ్య, గోపగాని వెంకటేశ్వర్లు, శీలం వీరన్న, మచ్చిక రాజు, జూలూరి హరిప్రసాద్, కందుల శ్రీనివాస్, పంజాల వెంకట్, ముంజ అశోక్, గోడిశాల భాస్కర్, పుల్లూరి స్వామి, గండి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నత్తే నయం!



29వ డివిజన్ రామన్నపేటలో నిలిచిన డ్రెయినేజీ పనులు



అసంపూర్తిగా కరీమాబాద్ దసరా రోడ్డు

- అభివృద్ధి పనులు ఆలస్యం
- పూర్తయిన పనులకు బిల్లులివ్వాలంటున్న కాంట్రాక్టర్లు
- మౌనం వహిస్తున్న ఇంజనీర్లు, ఉన్నతాధికారులు
- భరోసా ఇచ్చి కాలం వెళ్లదీస్తున్న పాలకవర్గ పెద్దలు

వరంగల్ అర్బన్: గ్రేటర్‌లో అభివృద్ధి పనులు ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపడుతున్న స్మార్ట్‌సిటీ, పట్టణ ప్రగతి, ఎస్సీ సబ్ ప్లాన్, నగరబాట, సాధారణ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు ఏ ఒక్క పనీ గడువులోగా పూర్తవ్వట్లేదు. ఇందుకు కారణం ఇప్పటికే పూర్తయిన పనులకు బిల్లులు రాకపోవడం. పనుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నామని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకవర్గం పెద్దలు, ఉన్నతాధికారులు సమాధానం దాటవేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో నగరంలో అభివృద్ధి పనులు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్నట్లుగా కొనసాగుతున్నాయి. దీంతో వాహనదారులు, వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. అసంపూర్తి పనులతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

నిధులేవి?

నిబంధనల ప్రకారం సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు 90 రోజుల్లో పూర్తి చేయాలి. కల్వర్టులు, వంతెనలు, ఇతర పెద్ద పనులు 120 రోజుల్లో పూర్తి చేయాలి. కానీ నిధులు లేక, బిల్లులు రాక కాంట్రాక్టర్లు టెండర్ నిబంధనల్ని విస్మరిస్తున్నారు. ప్రభుత్వాల నుంచి ప్రజాప్రతినిధులు నిధుల కోసం ప్రయత్నాలు చేస్తున్నా సఫలీకృతం కావట్లేదనే విమర్శలున్నాయి.

ఎక్కడి పనులు అక్కడే..

- హనుమకొండ పద్మాక్షి గుట్ట–హంటర్ రోడ్డు న్యూశాయంపేట రోడ్డు పనులు మూడేళ్లు గడిచినా.. అసంపూర్తిగా నిలిచాయి.
- ములుగు రోడ్డు నుంచి లేబర్ కాలనీ వరకు, వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్, స్టేషన్ రోడ్డు, చౌరస్తా, పోచమ్మమైదాన్ వరకు పనులు 80 శాతం పూర్తి కాగా.. మిగిలిన పనులు నిలిచిపోయాయి.
- కరీమాబాద్ కీర్తి బార్ నుంచి గవిచర్ల క్రాస్ రోడ్డు, దసరా రోడ్డు పనులు కేవలం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ఏడాది కిందట ప్రారంభమయ్యాయి. కానీ ఆశించిన స్థాయిలో ముందుకు సాగట్లేదు.
- హనుమకొండ, కాజీపేట, వరంగల్‌లోని శ్మశాన వాటికలు నత్తనడకన కొనసాగుతున్నాయి.
- హంటర్ రోడ్డు 12 మోరీల సెంటర్ నుంచి పోతననగర్ వరకు రూ.2 కోట్లతో చేపట్టిన పనులు మధ్యలోనే నిలిపేశారు.
- వరంగల్ ప్రాంతంలోని 29వ డివిజన్ రామన్నపేటలో పెద్ద మోరీ పనులు ఏడాదిన్నర గడిచినా పూర్తి కాలేదు.
- ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా వివిధ డివిజన్లలలో కొనసాగుతున్న 39 పనులు సగం కూడా పూర్తి కాలేదు.
- నగరబాటలో భాగంగా రూ.15.50 కోట్లతో 96 పనులు ప్రతిపాదించగా.. కొన్ని టెండర్లు పూర్తవగా.. మరికొన్ని ప్రారంభ దశలోనే మగ్గుతున్నాయి.

క్షీరాభిషేకాలు చేయొద్దు

- నా కర్తవ్యం నిర్వర్తిస్తున్నాను
- పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్

వరంగల్ క్రైం: 'ఉద్యోగ నిర్వహణలో భాగంగానే భూ తగాదాలను పరిష్కరించి ప్రజలకు న్యాయం చేస్తున్నాను.. భూ బాధితులు ఎవ్వరు కూడా నా చిత్రపటలకు పాలభిషేకాలు చేయవద్దు' అని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ ప్రజలకు సూచించారు. పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి భూ కబ్జాలకు సంబంధించిన కేసులు పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తున్నానని చెప్పారు. దీంతో న్యాయం పొందిన వారు నా ఫ్లెక్సీలకు పాలభిషేకాలు చేస్తున్నారనీ.. ఇకపై అలా చేయవద్దని సూచించారు. నిరంతరం శాంతిభద్రతలను పరిరక్షించడంతో పాటు నిరుపేద ప్రజలకు న్యాయం అందించాల్సిన బాధ్యత తనపై ఉందని, అందులో భాగంగానే భూకబ్జాలకు సంబంధించిన కేసులపై వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో లోతుగా పరిశీలించి, విచారణ చేపట్టి ఇతర ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సహకారంతో చట్ట పరిధిలో బాధితులకు న్యాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీసులపై అభిమానం చాటేందుకు పాలభిషేకాలు చేయాల్సిన అవసరం లేదని సీపీ ఒక ప్రకటనలో సూచించారు.

త్వరలో కేయూ సెమిస్టర్ ఫలితాలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఎం, బీఎస్సీ, బీసీఏ కోర్సుల మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు త్వరలో వెలువడనున్నాయి. జవాబు పత్రాల మూల్యంకణం ఇటీవలనే పూర్తియింది. ఈసారి కేయూ పరీక్షల విభాగంతో పాటు ఖమ్మంలోనూ మూల్యంకణం నిర్వహించగా సుమారు 47 రోజుల్లోనే ప్రక్రియ ముగిసింది. వారం రోజుల్లో ఫలితాలు విడుదల చేయడానికి కసరత్తు చేస్తున్నామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి తెలిపారు.

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

- జిల్లాలో 56 పరీక్ష కేంద్రాల్లో హాజరు కానున్న 9,728 మంది విద్యార్థులు
- కంట్రోల్ రూం 8919974862 ఏర్పాటు
- డీఈఓ వాసంతి



రాయపర్తి జెడ్పీఎస్ఎస్‌లో సౌకర్యాలు పరిశీలిస్తున్న అధికారులు

కాశోజీ సెంటర్ : నేటి (సోమవారం) నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో 56 పరీక్ష కేంద్రాల్లో 293 పాఠశాలలకు చెందిన 9,728 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో 5,013 మంది బాలురు, 4,715 మంది బాలికలు ఉన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. పర్యావేక్షణ నిమిత్తం 56 మంది చీఫ్ సూపరింటెండెంట్స్, 56 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 34 సిట్టింగ్, 2 ఫ్లయింగ్ స్క్వాడ్స్ విధుల్లో పాల్గొననున్నారు. ఏమైన ఇబ్బందులు తలెత్తితే కంట్రోల్ రూం నంబర్ (8919974862)కు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు. పరీక్ష కేంద్రాల చుట్టు పక్కల సీఆర్‌పీసీ 144 సెక్షన్ అమలు చేయాలని, కేంద్రాల చుట్టూ పక్కల జిరాక్స్ సెంటర్లను పరీక్ష సమయం పూర్తయ్యే వరకు మూసి ఉంచేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచన మేరకు పోలీసు సిబ్బందికి డ్యూటీలు వేశారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను చేపట్టాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చొరవ తీసుకొని వెంటనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని దీక్ష చేస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సదాశివరెడ్డి, జనరల్ సెక్రటరీ పెండెం రాజు, ఉపాధ్యక్షుడు సీహెచ్ రవీందర్‌రాజు, కోశాధికారి డి.కిరణ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు సీఎస్‌ఆర్ మల్లిక్, డి.నవీన్‌కుమార్, పి.చంద్రయ్య, సీహెచ్ లింగారావు, ఎ.రాజారామ్, బాధ్యులు జి.భాస్కర్‌రావు, తిరునగరి శ్రీనివాస్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.సదానందం, మెరుగు ప్రసన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య


బాలరాజ్ మృతదేహం

దంతాలపల్లి: మనోవేదనతో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన సంపెట బాలరాజ్ (36) భార్య సరోజన 7 సంవత్సరాల క్రితం మృతిచెందగా.. నాటినుంచి తాగుడుకు బానిసయ్యాడు. తను కూతురుకు పెళ్లి వయసు రావడంతో తమ ఆర్థిక పరిస్థితి బాగాలేక పెళ్లి చేసే పరిస్థితి లేక మనోవేదన చెంది, ఆదివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడని మృతుడి అన్న సంపెట వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకునట్లు ఎస్సై కూచిపుడి జగదీష్ తెలిపారు.

లైంగిక వేధింపులతో బాలిక..

దేవరుప్పుల: లైంగిక వేధింపులతో బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం నీర్మాల గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్సై సదానందం తెలిపిన వివరాల ప్రకారం.. నీర్మాలకు చెందిన నల్ల క్రాంతి అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన బాలికను తరచూ లైంగికంగా వేధింపులకు గురి చేయడంతో మనస్థాపం చెందిన బాధితురాలు ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చెప్పారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

గార్ల: అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మానుకోట జిల్లా గార్ల మండలం సీతంపేటకు చెందిన భూక్యా అరుణకు 7సంవత్సరాల క్రితం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పంగిడికి చెందిన భూక్యా హనుమతో వివాహం జరిగింది. వీరి సంసార జీవితం కొన్నేళ్లపాటు సజావుగానే సాగింది. వీరికి కుమారుడు ఉన్నాడు. పెళ్లి సమయంలో వరకట్నం తక్కువగా ఇచ్చారని, ఇప్పుడు అదనపు కట్నం రూ.5 లక్షలు తేవాలంటూ భార్య అరుణను తరచూ భర్త అత్తమామలు వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో వేధింపులు తట్టుకోలేక తల్లిగారి ఇంటికి వచ్చిన అరుణ భర్త, అత్తమామలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు భర్త అత్తమామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.



టార్గెట్.. ర్యాంక్

- ప్రత్యేకంగా క్రాష్ కోర్స్ నిర్వహణ
- అనుభవజ్ఞులైన అధ్యాపకులచే కోచింగ్
- మైనార్టీ గురుకులాల విద్యార్థులకు వరం
- నేటి నుంచి నెల పాటు ఉచిత తరగతులు

న్యూశాయంపేట: ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాయి. మైనార్టీ గురుకులాల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులను ఇంజనీర్లు, డాక్టర్లుగా తీర్చిదిద్దేందుకు పేరు ప్రఖ్యాతిగాంచిన యూనివర్సిటీలు, కళాశాలలో ఉచిత సీట్లు సాధించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఇంటర్ సైన్స్ గ్రూపులో రెండో సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులను ఎంసెట్ ఎంట్రెన్స్ కోసం సన్నద్ధం చేసేందుకు తెలంగాణ మైనార్టీ గురుకులాల విద్యాసంస్థ(టీమ్రీస్) ద్వారా దరఖాస్తులు ఆహ్వానించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు తీసుకుని విద్యనభ్యసిస్తున్న సుమారు 6వేలకు పైగా విద్యార్థులు దరఖాస్తులు సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల వారీగా బాలికలకు, బాలురకు వేర్వేరుగా ప్రత్యేక సెంటర్లు కేటాయించి కోచింగ్ ఇచ్చేందుకు (తెలంగాణ మైనార్టీ గురుకులాల విద్యాసంస్థ) టీమ్రీస్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. వీరికి అనుభవజ్ఞులైన సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్‌తో పాటు గెస్ట్ ఫ్యాకల్టీలతో ఎంసెట్ కోచింగ్ ఇప్పించి ఇంజనీరింగ్, మెడికల్ సీట్లు, ఉత్తమ ర్యాంకులు సాధించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఎంసెట్ క్రాష్ కోర్స్ -23 పేరిట నెల రోజుల పాటు విద్యార్థులకు కోచింగ్ క్లాసులు నిర్వహించనున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పదహారు మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలు ఉన్నాయి. వీటిలో 8 బాలికల కోసం, 8 బాలురకు కేటాయించారు. వీటిలో బాలికలకోసం, బాలుర కోసం ఒకటి చొప్పున ఒకేషనల్ కళాశాలలు పనిచేస్తున్నాయి. ఇందులో ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులు బోధిస్తున్న బాలుర కళాశాలలు వరంగల్ (బి)-1, కాజీపేట(బి)-1, మహబూబాబాద్(బి)-1, జనగామ(బి)-1, భూపాలపల్లి (బి)-1 తో పాటు బాలికల కోసం ఘన్‌పూర్(జి)-1, తొర్రూరు (జి)-1, ములుగు(జి)-1, హనుమకొండ(జి)-1, వరంగల్(జి)-1, నర్సంపేట(జి)-1 కళాశాలలు పనిచేస్తున్నాయి. ఎంసెట్ ఎంట్రెన్స్ కోసం 206 మంది బాలురు, 187 మంది బాలికలు దరఖాస్తు చేసుకున్నారు.

విషయ నిపుణులచే కోచింగ్..

ఎంసెట్‌లో విద్యార్థులకు కోచింగ్ ఇచ్చేందుకు వీలుగా అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురుకులాల్లో పనిచేస్తున్న విషయ నిపుణులు అనుభవజ్ఞులైన 25 మంది అధ్యాపకులను గుర్తించారు. వీరికి తోడుగా విషయ నిపుణులైన 10 మంది గెస్ట్ ఫ్యాకల్టీలను ఎంపిక చేసి కోచింగ్ ఇప్పించనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎంసెట్‌లో మంచి ర్యాంకుల సాధనే లక్ష్యంగా అధికారులు తగిన కార్యాచరణను రూపొందించారు. బాలుర కోసం వరంగల్ రంగశాయిపేట జక్కలొద్ది బాలుర గురుకులం, బాలికల కోసం, హనుమకొండ కేయూ క్రాస్‌రోడ్‌లోని వరంగల్(1) బాలికల గురుకులంలో కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

TELANGANA MINORITIES RESIDENTIAL EDUCATIONAL INSTITUTIONS SOCIETY (TMREIS)


తరగతి గదిలో విద్యార్థులు

ప్రత్యేక స్లాట్స్ ఏర్పాటు



విద్యార్థులకు కోచింగ్ ఇవ్వడానికి సబ్జెక్ట్‌ల వారీగా నాలుగు స్లాట్స్ ఏర్పాటు చేసాం. నెల రోజుల్లో కోర్సు పూర్తి అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకుంటున్నాము. వారానికి ఒకసారి వీక్లీ టెస్ట్, కోర్సు పూర్తి అయ్యాక గ్రాండ్ టెస్ట్‌ను నిర్వహిస్తాం.

\- నాగరాజు, మాథ్స్ లెక్చరర్, వరంగల్(బి1)

ఎంసెట్‌లో ర్యాంకులు సాధిస్తాం



విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించే దిశగా తగిన కార్యాచరణ రూపొందించాం. అధికారుల సూచనలు తోడు విద్యార్థుల చాయిస్ అనుగుణంగా అనుభవజ్ఞులైన గెస్ట్ ఫ్యాకల్టీలను ఎంపిక చేసి కోచింగ్ ఇప్పిస్తున్నాం.

\- దాసరి కృష్ణకుమారి, ప్రిన్సిపాల్, వరంగల్(జి1)

నేటి నుంచి శత చండీ మహాయాగం


మహాయాగం కోసం చేస్తున్న ఏర్పాట్లు

- మాంగళ్య, పీఎన్.మూర్తి, కాసం పుల్లయ్య అండ్ సన్స్ ఆధ్వర్యంలో నిర్వహణ


ఓంనమశివాయ, భద్రకాళి శేషు

కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్‌రోడ్డు ఖమ్మం బైపాస్ ఫ్లైఓవర్ పక్కన గల మాంగళ్య షాపింగ్ మాల్ స్వస్థలంలో మాంగళ్య షాపింగ్ మాల్, పీఎన్.మూర్తి అండ్ ఫ్యామలీ, కాసం పుల్లయ్య అండ్ సన్స్ సారథ్యంలో శతచండీ మహాయాగం నిర్వహించనున్నారు. ఈనెల 3, 4, 5 తేదీల్లో మూడు రోజుల పాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు భక్తి శ్రద్ధలతో శతచండీ మహాయాగం నిర్వహించేందుకు ఆదివారం ఏర్పాట్లు చేశారు. ఈసందర్భంగా భద్రకాళీ శేషు మాట్లాడుతూ.. సర్వజన శాంతి, లోక కల్యాణానికి శతచండీ మహాయాగాన్ని మాంగ్య షాపింగ్ మాల్, పీఎస్ మూర్తి అండ్ ఫ్యామలీ, కాసం పుల్లయ్య అండ్ సన్స్ నేతృత్వంలో నిర్వహిస్తున్నారని చెప్పారు. శ్రీ బ్రహ్మశ్రీ దేందుకూరి వెంకటేశ్వర గణాపాఠీ నేతృత్వంలో, ఉపాసకులు, వేద పండితులు, ఆగమ పండితులు పాల్గొని మూడు రోజుల పాటు శతచండీ మహాయాగాన్ని నిర్వహిస్తారన్నారు. ఈనెల 3,4,5 తేదీల్లో మూడు రోజుల పాటు యాగాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తొలి రోజు 3వ తేదీన గణపతి పూజ, పూర్వాంగ విధితో శతచండీ మహాయాగం ఆరంభం, కొడకండ్ల రాధాకృష్ణశర్మ బృందంచే సంకీర్తనాలాపన రెండో రోజు నారీమణులతో కుంకుమ పూజ, మహాలింగార్చన, గోపూజ, మూడో రోజు శత చండీ మహాయాగానికి పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ, మహా అన్నదానం కార్యక్రమాలను నిర్వహిస్తారు. కాగా, శతచండీ మహాయాగంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కాసం ఓం నమ శివాయ కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. సుమారు పదివేల మంది యాగంలో పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

బంధాల విలువలు తెలిపిన 'బలగం'

- రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు
- తొర్రూరులో బలగం యూనిట్‌ను అభినందించిన మంత్రి


బలగం డైరెక్టర్ వేణు, నటుడు రచ్చ రవితో మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: అచ్చ తెలంగాణ యాసలో బంధాల విలువ తెలిపేలా 'బలగం' సినిమా ఉందని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని వెంకటేశ్వర థియేటర్‌లో అనాథ పిల్లలు, స్థానికులతో కలిసి 'బలగం' చిత్రాన్ని మంత్రి వీక్షించారు. పలు సన్నివేశాలను చూసి ఉద్వేగానికి లోనయ్యారు. చిత్రం చూసిన తర్వాత థియేటర్‌కు వచ్చిన బలగం డైరెక్టర్ వేణు, నటుడు రచ్చ రవి, కెమెరామెన్‌లను మంత్రి శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పైసల కన్నా బంధుత్వమే గొప్పదని, బంధాల విలువ తెలిసేలా ఉన్న బలగం సినిమాను ప్రతి ఇంట్లోని తాత, నానమ్మ, అమ్మ, నాన్నల బలగంతో కలిసి చూడాలని కోరారు. సహజత్వంతో కూడిన అచ్చ తెలంగాణ చిత్రమని కొనియాడారు. తెలంగాణ భాష, సంస్కృతికి అద్దం పట్టేలా చిత్రాలు రావడం శుభపరిణామన్నారు. మండలంలోని అమ్మాపురం గ్రామవాసి గట్టు నవీన్ తీసిన 'శరపంజరం' చిత్ర బృందం మంత్రిని కలవగా వారిని అభినందించారు.బలగం చిత్ర డైరెక్టర్ వేణు యెల్దండి మాట్లాడుతూ.. తెలంగాణలో జరిగే వాస్తవ సంఘటనల సమాహారం ఈ చిత్రమని, ఈ చిత్రం కుటుంబ బాంధవ్యాలను కలిపేలా ఉందంటూ ప్రశంసలు రావడం ఆనందంగా ఉందన్నారు. బలగం చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ సీజ్

ఖానాపురం : అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై పిట్టల తిరుపతి తెలిపారు. ఈ మేరకు మండలంలోని అశోక్‌నగర్ సైనిక్ స్కూల్ వద్ద మట్టిని అక్రమంగా తరలిస్తున్న రవీందర్‌కు చెందిన మట్టి ట్రాక్టర్‌ను ఆదివారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి తరలింపునకు అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

ఖిలా వరంగల్: మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పడమరకోటకు చెందిన ఓ యువకుడు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం. తోటకూరి కోటేశ్వర్ (28) తల్లిదండ్రులు తన చిన్నప్పుడే మృతి చెందగా.. మేనత్త బత్తుల ఉమ పెంచి పెద్ద చేసింది. ఈక్రమంలో ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న కోటేశ్వర్ మార్చి 28న డ్యూటీకి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా.. ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో బత్తుల ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అర్ధ శతాబ్దపు అపూర్వ సమ్మేళనం


పాఠశాల వేదికపై 1966-67/68 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

- 50ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు

ప్రస్తుతం వారంతా వృద్ధాప్యంలో ఉన్నారు.. చిన్ననాటి జ్ఞాపకాలను, నాటి స్నేహితులను ఓసారి కలుసుకోవాలనుకున్నారు. తేదీ, వేదిక నిర్ణయించుకుని ఆదివారం అందరూ ఒకే వేదికపై కలుసుకుని బాల్యంలోని జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. వారిలో ఓ పాఠశాలలో చదివిన పూర్వవిద్యార్థులు కాగా.. మరికొందరు ఓ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్వ విద్యార్థులున్నారు.

జనగామ: చిన్ననాటి స్నేహితులు 57ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత ఒకే వేదికపై కలుసుకుని.. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కలిసి చదువుకుని.. వృద్ధాప్యంలో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిన దోస్తులను గుర్తుకు చేసుకుంటూ.. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 73 ఏళ్ల వయసులో అందరూ ఒక్కచోట చేరిన ఆనందంలో చిన్నిపిల్ల ల్లా మారిపోయారు. జనగామ పట్టణం సూర్యాపేట రోడ్డు కెమిస్ట్ భవన్‌లో జనగామ జిల్లా పరిషత్ హైస్కూల్ 1966-67/68 బ్యాచ్ 10వ తరగతి(హెచ్ఎస్సీ) పూర్వ విద్యార్థులు ఆది వారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ముఖ్యఅతిథిగా పూర్వ విద్యార్థులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమున, చాంబర్ అధ్యక్షుడు పి.లింగయ్య హాజరు కాగా.. ఆరుట్ల నర్సింహారెడ్డి కార్యక్రమాన్ని నడిపించారు. ఉన్నత స్థాయిలో పాఠాలు బోధించిన గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామానికి చెందిన 94 ఏళ్ల గురువు (ఉపాధ్యాయుడు) ప్రభాకర్‌రావును ఘనంగా సత్కరించి, ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. 45 మందికి పైగా హాజరైన ఈ ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులంతా కలిసి సహపంక్తి భోజనం చేశారు. పూర్వ విద్యార్థులు మారం లక్ష్మయ్య, డాక్టర్ జనార్దన్‌రెడ్డి, తేరాల నరసింహరాములు, చంద్రశేఖర్, ఆర్.శ్రీనివాసులు, బుక్క రవీందర్, మారోజు ప్రేమానందం, మోహన్‌రెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ వీరారెడ్డి, వీరబ్రహ్మం, బి.సత్యనారాయణచారి పాల్గొన్నారు.

1971–73 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1971–73లో ఇంటర్మీడియట్ పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు హైదరాబాద్ హైటెక్‌సిటీలోని ఓఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా దంపతులుగా హాజరైన వారు కల్మషమెరుగని బాల్యం.. జీవిత విశేషాలను పంచుకుని పరవశించిపోయారు. పదవీ విరమణ అనంతరం విశ్రాంతి పొందుతున్న తీరుతెన్నులను పంచుకున్నారు. సమ్మేళనంలో రంగరాజు రవీందర్ రావు, చిర్ర సుదర్శన్‌రెడ్డి, దేవేందర్, వి.సుదర్శన్‌రెడ్డి, సోమ కృష్ణమూర్తి, కిరణ్మయి, అనితా సాగర్, ఎర్రమల్ల సుధాకర్(మున్సిపల్ మాజీ చైర్మన్), జ్యోతిర్మయి, బండారు లలిత, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


1971-73 ఇంటర్ పూర్వ విద్యార్థులు

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

భూమి అమ్మబడును

■గీసుకొండ, పోలీస్ స్టేషన్‌కు 1 కిలోమీటర్ లోపు అగ్రికల్చర్ భూమి 2 గుంటలు, 3గుంటలు, 5 గుంటలు, 10 గుంటలు అతి తక్కువ ధరకు అమ్మబడును. సంప్ర॥ 9908862995. [W-785476]

అద్దెకు లభించును

■సుబేదారి పోస్టాఫీస్ వెనుక 4500 sft 3 ఫ్లోర్స్, ఆఫీసుకు/ క్లినిక్ / కంప్యూటర్ సెంటర్/ కోచింగ్ సెంటరుకు/ రీడింగ్ రూమ్స్/ హాస్టలుకు - కిరాయకు ఇవ్వబడును. సెల్: 9291707707, 9848072185. [WA-6937]

FLATS FOR SALE

■KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26881]

HOUSE FOR SALE

■ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26882]

■వరంగల్, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26883]

■ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నెమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26884]

PLOT FOR SALE

■కేవలం 2 లక్షలకే 121 చ.గ. ఫామ్ ప్లాట్ కొనండి. ప్రతి ప్లాట్‌పై ఖచ్చితమైన బహుమతులు గెలుపొందండి. Breeza కారు,హీరో బైక్స్-10, LED T.V. లు-10, A/C లు -10 మరెన్నో బహుమతులు. 9154047151, 9700518878. [WA-6935]

■GWMC - KUDA పరిధిలోని 3300 చ॥గ॥ ఏనుమాముల మార్కెట్ మేన్‌గేట్‌కి ఎదురుగా 2 సైడ్ రోడ్స్ ఫేసింగ్ భూమి అమ్మకానికి కలదు. సంప్ర॥ 9440290009, 9441689294. [W-785507]

తాజా వార్తల కోసం లాగిన్ అవ్వండి www.sakshi.com

SERVICES

■హౌస్, ఫ్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ వారికి ఆర్థిక సహాయం చేయబడును. హన్మకొండ. సెల్: 8331878592. [WA-6934]

■వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేక్ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 94630 26237. [T-1801]

LOANS

■సిరి అసోసియేట్స్ హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-785472]

WANTED

■శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ జనగామ ఏరియాలో పనిచేయుటకు Sales Executives కావలెను. ఆకర్షణీయమైన జీతం మరియు ఇన్సెంటివ్స్ మరియు బోనస్ లభించును. అర్హత: డిగ్రీ వయస్సు 27 సంవత్సరాలలోపు ఉన్న వారికి అవకాశం. సెల్: 8978380199 [W-785477]

■వరంగల్, హన్మకొండ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ స్త్రీ/పు॥ అర్జెంటుగా కావలెను. సాలరీ: 12000-15000. సంప్ర॥ 8688072125 [W-785468]

■మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190662]

■ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రసులు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్ ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795295]

■అతి తక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి కొత్తరికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 77308 99503 [G-536]

■ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000-20,000 వరకు జీతం మరిన్ని వివరాలకై, 90004 08325 [G-795293]

■హరేకృష్ణ హోంకేర్, నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం. జీతం:16k - 18k విజయవాడ.ఫోన్ : 9640528899, 9640648899 [H-793405]

■Hydలో 24గం॥ ఇంట్లో ఉంటూ బేబీకేర్ పని చేయుటకు 20-30yrs అనుభవం గల ఒంటరి మహిళ (Single Lady) కావలెను. మంచి జీతం + భోజనం + వసతి కలదు. Ph: 9390644882 [H-793739]

WANTED TEACHERS

■(1) Pre-Primary 5 - Female Teachers need (passion to teach for pre-primary) (2) High School Teachers (All Subjects needed). Come with Resume on 2,3,4,5 of April. Time:10am-12:30 pm & 2.30pm-4pm. Smile Digi School, Reddy Colony, HNK. 9542557733, 7794924779. [WA-6936]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/-రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


ఆస్పత్రిలో క్షతగాత్రుడు నవీన్‌రెడ్డి


ఘటనా స్థలంలో సురేష్‌రెడ్డి మృతదేహం

డోర్నకల్/కురవి: మానుకోట జిల్లా డోర్నకల్, సీరోలు మండల శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. సీరోలు ఎస్సై లావుడ్యా నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణంలోని వరంగల్ క్రాస్‌రోడ్డుకు చెందిన మల్లు సురేష్‌రెడ్డి(40), ఇదే ప్రాంతానికి చెందిన కుందూరు నవీన్‌రెడ్డితో కలిసి ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి కురవి వైపు వస్తుండగా మన్నెగూడెం దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో ద్విచక్రవాహనంపై నుంచి పడి సురేష్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాల పాలైన నవీన్‌రెడ్డిని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయయని సురేష్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరేష్ తెలిపారు.

పశువులను తప్పించబోయి..


వెంకటేశ్వర్లు(ఫైల్)

తొర్రూరు: పశువులను తప్పించబోయి అదుపు తప్పి ఆటో చెట్టుకు ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన ఆదివారం మానుకోట జిల్లా తొర్రూరు మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మిరియాల గ్రామానికి చెందిన తోట వెంకటేశ్వర్లు (43) తొర్రూరు పరిసర ప్రాంతాల్లో బ్రెడ్ సరఫరా చేసే ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం బ్రెడ్ ప్యాకెట్ల లోడ్‌తో ఉన్న ట్రాలీ ఆటో నెల్లికుదురు వైపు వెళ్తుండగా మండల శివారు పీజీ తండా దగ్గర పశువులు అడ్డురాగా వాటిని తప్పించబోయాడు. వేగంగా వెళ్తున్న ఆ ఆటో అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన డ్రైవర్‌ను స్థానికులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య రజిత, 9నెలల బాబు ఉన్నాడు. వెంకటేశ్వర్లు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కరెంట్ షాక్‌తో యువకుడు ..


వరుణ్‌సందేశ్ (ఫైల్)


దంతాలపల్లి: కరెంట్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన మానుకోట జిల్లా దంతాలపల్లి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన కారుపోతుల యమున వెంకన్న దంపతుల కుమారుడు వరుణ్ సందేశ్(14) తొర్రూరు నల్లంద పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. వెంకన్న తమ ఎదుట చెట్టుకు బట్టలు ఆరేసేందుకు తీగ కట్టారు. చెట్టు పక్కనే ఉన్న లెవన్ కేవీ లైన్ ఆదివారం సాయంత్రం వీచిన గాలికి చెట్టుకు, తద్వారా దండెం తీగకు కరెంటు సరఫరా అయింది. అదేసమయంలో ఇంట్లోకి వెళ్లే వరుణ్ సందేశ్ తనకు అడ్డుగా ఉన్న తీగను తప్పించేక్రమంలో కరెంటు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కూచిపుడి జగదీష్ తెలిపారు.

నీటికోసం వెళ్లి వృద్ధురాలు..

ఏటూరునాగారం: నీటి కోసం వెళ్లిన ఓ వృద్ధురాలు రోడ్డుపై కాలు జారిపడి మృతి చెందిన ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. క్రాస్‌రోడ్డు పోలీస్‌స్టేషన్ సమీపంలో నివాసం ఉంటున్న గరిగె రంగమ్మ ఇంట్లో తన అమ్మమ్మ వనపర్తి లక్ష్మి(98) నివాసం ఉంటుంది. ఈ క్రమంలో ఆదివారం నీటి కోసం వెళ్లి రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంక్షేమ పాలన అందించిన కాకతీయులు

- బీజేపీ మహిళా మోర్చా కేరళ అధ్యక్షురాలు నివేదిత సుబ్రమణియన్


శిల్ప సంపదను తిలకిస్తున్న నివేదిత సుబ్రమణియన్, తదితరులు

ఖిలా వరంగల్: రైతు సుభిక్షమే కాకతీయుల లక్ష్యమని, సంక్షేమ పాలనను అందించిన ఘనత కాకతీయులకే దక్కిందని బీజేపీ మహిళా మోర్చా కేరళ అధ్యక్షురాలు నివేదిత సుబ్రమణియన్ అన్నారు. వరంగల్ పర్యటనలో భాగంగా చారిత్రక ప్రసిద్ధి చెందిన కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ కోటను ఆదివారం ఆమె సందర్శించారు. మధ్యకోటలోని శిల్ప కళా సంపదను బీజేపీ 38వ డివిజన్ అధ్యక్షుడు ఎల్లబోయిన చంద్రమోహన్‌తో కలిసి ఆమె ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఏకశిల గుట్ట, ఖుష్‌మహల్, రాతి, మట్టికోట అందాలను వీక్షించారు. కాకతీయుల విశిష్టతను కేంద్ర పురావస్తుశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బండారి కల్యాణి, ఉపాధ్యక్షురాలు కాసు శిల్ప, కార్యదర్శి బండి సుజాత, కొప్పుల క్రాంతి, కండ్రాతి శ్రీను, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


వీరన్నను పరీక్షిస్తున్న 108 సిబ్బంది

కురవి: ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వస్తున్న బైక్ ఢీకొనడంతో బైక్‌పై ఉన్న భూక్యా వీరన్న(37) అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రం శివారు జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. కురవి ఎస్సై బి.రాము తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలం మల్యాల శివారు సాధు తండాకు చెందిన భూక్యా వీరన్న తన బైక్‌పై మరిపెడ వైపు నుంచి కురవి వైపు వస్తున్నాడు. కురవికి చెందిన ట్రాక్టర్ అదే మార్గంలో వస్తోంది. వెనుక నుంచి వస్తున్న బైక్ ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో వీరన్న రోడ్డుపై పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలియడంతో కురవి రెండో ఎస్సై మధుబాబు ఘటనా స్థలానికి చేరుకున్నారు. 108 వాహనం సిబ్బంది చేరుకుని రోడ్డుపై పడిపోయిన వ్యక్తి మృతిచెందాడని నిర్ధారించి, మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు.